క్లుప్తంగా

కలెక్టర్‌ను కలసిన ఐఏఎస్ అధికారి

కర్నూలు(సెంట్రల్): జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను అగ్రికల్చర్ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్, రైతు బజార్ సీఈఓ ఎం.విజయసునీత మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె బుధవారం కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను క్యాంపు కార్యాలయంలో కలసి పుష్పగుచ్ఛం అందజేసి జిల్లాలో మార్కెట్ల పరిస్థితిపై చర్చించారు.

అక్రమ క్వారీపై కేసు

కర్నూలు (టౌన్): అక్రమ క్వారీపై గనుల శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. డోన్ మండలంలోని చిన్న మల్కాపురం, పెద్ద మల్కాపురం గ్రామాల పరిధిలోని సర్వే నంబర్ 288/4, 288/5, 292/1, 286, 285/1, 285/2, 285/3, 285/4 లలో 12 మంది వ్యక్తులు అక్రమంగా డోలమైట్, సోప్ స్టోన్ తవ్వకాలు చేస్తున్నారు. అలాగే పెద్దమల్కాపురంలోని సర్వే నంబర్ 100లో అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తున్నట్లు సమాచారం అందడంతో గనుల శాఖ అధికారులు బుధవారం దాడులు చేశారు. తవ్వకాలు చేస్తున్న వారిపై డోన్ రూరల్ మండలం పోలీసుస్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ వెల్లడించారు.

క్యాన్సర్ ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పిస్తాం

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో సాధ్యమైనంత త్వరగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎంపీ బస్తిపాటి నాగరాజు హామీ ఇచ్చారు. ఆయన బుధవారం స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించి వైద్యసేవల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆసుపత్రికి రావాల్సిన నిధులు తీసుకొచ్చి పనులను పూర్తి చేస్తామని చెప్పారు. ఆస్పత్రి పూర్తయితే రాయలసీమ ప్రాంత రోగులు క్యాన్సర్ చికిత్స కోసం హైదరాబాద్, బెంగుళూరుకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ, ఆసుపత్రి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, క్యాన్సర్ హెచ్ఓడీ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, నర్సింగ్ సూపరింటెండెంట్ అనసూయమ్మ ఉన్నారు.

ఆరోగ్య శాఖ అధికారులపై ఫిర్యాదు

కర్నూలు (హాస్పిటల్): తనకు బదిలీ జరగకుండా అడ్డుకున్నారంటూ ఫార్మసిస్టు రామచంద్రరావు మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులపై ఫిర్యాదు చేశారు. 2017 నుంచి డీఎంహెచ్‌ఓలుగా పనిచేసిన మీనాక్షి మహదేవ్, స్వరాజ్యలక్ష్మి, నరసింహులుతో పాటు సూపరింటెండెంట్లు శ్రీనివాసులు, అరుణ తనకు బదిలీ రాకుండా అడ్డుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు మూడవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు చిత్రలేఖన పోటీలు

కర్నూలు కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్‌జోన్స్ ఆధ్వర్యంలో 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీల పోస్టర్‌లను ఆర్‌యూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ సముద్రాల వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ శ్యామల సరోజిని, లయన్స్ జిల్లా చైర్మన్ రాయపాటి శ్రీనివాసులు ఆవిష్కరించారు. చిత్రలేఖన పోటీలు ఈనెల 23న సాయంత్రం 4 గంటలకు సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు వెంకటరమణ కాలనీలోని నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 93968 61308 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రేపు మాజీ సైనికుల సమావేశం

కర్నూలు(అర్బన్): మద్రాసు రెజిమెంట్ మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23న ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎస్‌ఆర్ రత్నరూత్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాచారం కోసం 08518-229445 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్

- నగరంలో 'ఫ్రీ లెఫ్ట్' విధానం
- పలు కూడళ్లలో ఐరన్ బారికేడ్లు ఏర్పాటు



ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఫ్రీ లెఫ్ట్ విధానంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

కర్నూలు: సర్కిళ్లు, సిగ్నల్స్ వద్ద వాహనాలు సులువుగా ముందుకు సాగేలా ట్రాఫిక్ అధికారులు కర్నూలు నగరంలో 'ఫ్రీ లెఫ్ట్' విధానం అమల్లోకి తెచ్చారు. సిగ్నల్స్ వద్ద ఎడమ వైపు వెళ్లే వారికి ఎరుపు సిగ్నల్‌తో పని లేకుండా నేరుగా వెళ్లేందుకు ఈ విధానాన్ని పోలీసులు తెరపైకి తెచ్చారు. వాహనదారులకు దీనివల్ల కొంత వెసులుబాటు కలిగింది. నగరంలో మొత్తం 16 సిగ్నల్ పాయింట్లు ఉన్నాయి. అధిక కూడళ్లలో ఎడమ వైపు వెళ్లేందుకు వీల్లేకుండా వాహనాలను నిలపడం, ఆటోవాలాలు తిష్ట వేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎడమ వైపు మార్గంలో వెళ్లాల్సినవారు హారన్లు మోగించినా వాహనాలు ముందుకు కదలక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో అంబులెన్స్‌లు కూడా ట్రాఫిక్ రద్దీలో ఇరుక్కుని ముందుకు కదలని పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇటీవల ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు చేపట్టిన మన్సురుద్దీన్ నగరంలో పర్యటించి ఒక అవగాహనకు వచ్చి ఫ్రీ లెఫ్ట్ విధానం అమలుకు శ్రీకారం చుట్టారు. సిగ్నల్స్ వద్ద ఎడమ వైపు ఫైబర్ కోన్లు లేదా సిమెంటు దిమ్మెలు పెట్టి వాహనాలు ఆగకుండా వెళ్లేందుకు గతంలో ఏర్పాట్లు చేశారు. అయినప్పటికీ పకడ్బందీగా అమలు కాలేదు. ఫ్రీ లెఫ్ట్ మార్గంపై కూడళ్లలో విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బంది పెద్దగా దృష్టి సారించకపోవడంతో పలు కూడళ్లలో వాహనదారులు నిత్యం నరకయాతన పడుతున్నారు. ఫ్రీ లెఫ్ట్ మార్గం తర్వాత బస్టాప్ ఉండటంతో ఆర్టీసీ డ్రైవర్లకు కూడా అక్రమ పార్కింగ్ తలనొప్పి వ్యవహారంగా మారింది. అలాంటి కూడళ్లను గుర్తించి ఫ్రీ లెఫ్ట్ మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించేందుకు ఐరన్ బారికేడ్లను ఏర్పాటు చేశారు.

ఐరన్ బారికేడ్లు ఏర్పాటు చేసిన ప్రాంతాలు

స్థానిక బళ్లారి చౌరస్తాలో హైదరాబాద్‌కు వెళ్లే సర్వీసు రోడ్డుపైనే కార్లు, ఆటోలు, ప్రైవేటు బస్సులు, ద్విచక్ర వాహనాలు నిలుపుతుండడం వల్ల ట్రాఫిక్ రద్దీ పెరగడమే గాక ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కోడుమూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే సర్వీసు రోడ్డులో (నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో) ఫ్రీ లెఫ్ట్ విధానం అమలుకు ఐరన్ బారికేడ్లు ఏర్పాటు చేశారు. అలాగే డోన్ వైపు నుంచి కోడుమూరుకు వెళ్లే మార్గంలో (ఎంజీ పెట్రోల్ బంకు దగ్గర) తోపుడు బండ్లు రోడ్డుపై ఉంచి వ్యాపారం సాగిస్తుండటంతో ట్రాఫిక్ రద్దీ పెరిగి వాహనదారులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. అలాగే హైదరాబాద్ వైపు నుంచి కర్నూలులోకి వచ్చే ఆంజనేయస్వామి గుడి ముందు కూడా ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఎక్కువ సంఖ్యలో నిలుపుతుండడం వల్ల బస్సుల నిలుపుదలకు సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో ఫ్రీ లెఫ్ట్ విధానం అమలులో భాగంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. రాజ్‌విహార్ సర్కిల్, ప్రభుత్వాసుపత్రి, పాతబస్టాండ్ నుంచి కొత్తబస్టాండ్‌కు వెళ్లే మార్గంలో, కలెక్టరేట్‌కు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు ఫ్రీ లెఫ్ట్ విధానం అమలులో భాగంగా బారికేడ్లను ఏర్పాటు చేశారు.

ప్రమాదాలు జరిగే ప్రాంతాల గుర్తింపు

ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు పలు చర్యలు చేపడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రమాదాలు, మరికొన్ని ప్రాంతాల్లో ప్రమాదాలకు కారణమవుతున్న అంశాలను గుర్తించారు. ఇందులో భాగంగా బళ్లారి చౌరస్తాలో రోడ్డు రిపేర్లు, రహదారుల విస్తరణకు సంబంధించి నేషనల్ హైవే అధికారులు, మున్సిపల్ అధికారులతో చర్చించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. త్వరలో అక్కడ ట్రాఫిక్ సిగ్నల్ కూడా ఏర్పాటు కానున్నాయి. చౌరస్తాలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణలో భాగంగా మైక్ సిస్టమ్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఆ ప్రాంతంలోని గుంతలను పూడ్చి వాహనాలు సాఫీగా ముందుకు సాగేలా ప్రణాళిక రూపొందించారు.



ఎంజీ పెట్రోల్ బంకు వద్ద ఏర్పాటు చేసిన ఫ్రీ లెఫ్ట్ బారికేడ్లు

ట్రాఫిక్ నియంత్రణకు ఆరు మొబైల్ టీమ్‌లు

కర్నూలు శివారులోని వెంకటరమణ కాలనీ, చెన్నమ్మ సర్కిల్, గుత్తి పెట్రోల్ బంకు, బిర్లా జంక్షన్, బళ్లారి చౌరస్తా ప్రాంతాల్లో ఎక్కువగా ట్రాఫిక్‌జామ్‌లు తలెత్తుతుంటాయి. సమస్య తెలిసిన వెంటనే ఆయా ప్రాంతాలకు వెళ్లి పరిస్థితిని చక్కదిద్దేందుకు నగరంలో ఆరు మొబైల్ టీమ్‌లు నిర్వహిస్తున్నారు. అలాగే సంతోష్ నగర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా డివైడర్లు ఏర్పాటు చేశారు. అలాగే ఆర్టీసీ కొత్తబస్టాండ్ సమీపంలోని ఇన్, అవుట్ గేట్ల వద్ద బారికేడ్ల సిస్టమ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు.



రాజ్‌విహార్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్రీలెఫ్ట్ ఐరన్ బారికేడ్లు

వాహనాలు అడ్డంగా నిలిపితే కేసులు



వాహనాలను ఎక్కడ పడితే అక్కడ రోడ్డుపై నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే మోటార్ వాహనాల చట్టం కింద జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తాం. మొబైల్ క్యాంటీన్లు, తోపుడు బండ్ల వ్యాపారులు రోడ్డుకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలి. అలా కాకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా రోడ్డుపైనే వ్యాపారాలు సాగిస్తే పెట్టీ కేసులు నమోదు చేసి కోర్టుకు పంపుతాం. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు అన్ని వర్గాల వారు సహకరించాలి.

– మన్సురుద్దీన్, ట్రాఫిక్ సీఐ

వృద్ధాశ్రమం తనిఖీ

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి బుధవారం కర్నూలులోని షిరిడీ సాయి వృద్ధుల శరణాలయాన్ని తనిఖీ చేశారు. శరణాలయానికి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి అక్కడి వృద్ధులు, మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి వృద్ధులకు సంబంధించిన చట్టాలు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ యాక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయాన్ని పొందే విధానాన్ని వివరించారు. శరణాలయ సిబ్బంది పాల్గొన్నారు.

8 మందికి బీఎల్‌ఓ బాధ్యతలు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ సచివాలయాల్లో పనిచేసే 8 మంది వార్డు కార్యదర్శులు, ఎమినిటీస్, ఎడ్యుకేషన్ కార్యదర్శులకు బూత్ లెవల్ ఆఫీసర్లుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సీ.కె.గీత, ఉరుకుందు, మాధురి, రాకేష్, సర్వేష్, భాగ్యలక్ష్మి, ఆస్మా జబీన్, రియాజ్ బాషాలను బీఎల్‌ఓలుగా నియమిస్తూ బుధవారం సాయంత్రం నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు.

పని సర్దుబాటు ప్రక్రియ ప్రారంభం

కర్నూలు (సిటీ): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తాత్కాలికంగా తీర్చేందుకు విద్యాశాఖ బుధవారం పని సర్దుబాటు ప్రక్రియను ప్రారంభించింది. మొదటగా 26 మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 256 మంది టీచర్లను మిగులు పోస్టులుగా గుర్తించింది. ఈ ఉపాధ్యాయులను ఆయా మండల స్థాయిలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండే స్కూళ్లకు సర్దుబాటు చేశారు. ఇందుకోసం మండల స్థాయిలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆన్‌లైన్‌లో పని సర్దుబాటు చేశారు. ఇందులో 55 మంది స్కూల్ అసిస్టెంట్లు, 201 ఎస్జీటీలను సర్దుబాటు చేశారు.

సెకండ్ బెటాలియన్ డీఎస్పీగా సుధాకర్‌రెడ్డి

కర్నూలు: ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్ డీఎస్పీగా ఐ.సుధాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం చిత్తూరు మహిళా పీఎస్ డీఎస్పీగా పనిచేస్తున్నారు. కర్నూలు బెటాలియన్‌లో పనిచేస్తున్న భక్తవత్సలం వైఎస్సార్ జిల్లాకు బదిలీ కావడంతో ఆ స్థానంలో సుధాకర్‌రెడ్డిని నియమిస్తూ డీజీపీ ద్వారకా తిరుమల రావు ఉత్తర్వులు జారీ చేశారు.

– పత్తికొండ డీఎస్పీగా వెంకటరామయ్య నియమితులయ్యారు. ఇక్కడున్న శ్రీనివాసరెడ్డి బదిలీపై వెళ్లారు.

సీ.క్యాంపు రైతుబజారును అభివృద్ధి చేస్తాం

- మరింత విస్తరించేందుకు కృషి
- పరిశుభ్రతకు పెద్దపీట వేయాలి
- మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత ఆదేశం



సీ.క్యాంపు రైతుబజారును పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని సీ.క్యాంపు రైతుబజారును సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత తెలిపారు. బుధవారం కర్నూలుకు వచ్చిన ఆమె సాయంత్రం సి.క్యాంపు రైతుబజారును సందర్శించారు. రైతులు, వినియోగదారులు, పొదుపు మహిళలతో వివిధ అంశాలపై చర్చించారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఉల్లితో సహా ఏపీ కూరగాయల ధరలు ఏ విధంగా ఉన్నాయని ఆరా తీశారు. రైతులు, వినియోగదారుల తాకిడి ఎక్కువగా ఉన్నందున రైతుబజారును మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. విస్తరణకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. షాపులకు స్లాబ్, షెడ్లకు షీట్లు వేయాలని సూచించారు. ఇందువల్ల ఖర్చును తగ్గించుకోవచ్చని వివరించారు. రైతుబజారులో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని, సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. లైటింగ్ బాగా ఉండేలా చూసుకోవాలన్నారు. రైతుబజారు బయట అనధికారికంగా ఉన్న కూరగాయల వ్యాపారాలను తొలగించాలని పలువురు కోరారు. దీనిపై డైరెక్టర్ స్పందిస్తూ మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళతామన్నారు. మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డీడీ శ్రీకాంత్‌రెడ్డి, ఏడీ నారాయణమూర్తి, ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను డైరెక్టర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

స్పోర్ట్స్

జాతీయ స్థాయి కరాటేలో పతకాలు

కర్నూలు (టౌన్): ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలోని పంచకుల పట్టణంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు పతకాలు సాధించారు. బనగానపల్లెకు చెందిన దివ్య (రజతం) చైతన్య రెడ్డి (కాంస్యం) పతకా లు సాధించారని రాష్ట్ర కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు కోలా ప్రతాప్ బుధవారం వెల్లడించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు అభినందించారు.

క్రీడలతో మానసికోల్లాసం

కర్నూలు (టౌన్): మానసిక ఆరోగ్యానికి క్రీడలు అవసరమని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్, సీనియర్ స్థాయి విభాగాల్లో క్రీడాపోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. ఉషూ మార్షల్‌ఆర్ట్స్ వంటి క్రీడలు ఆత్మరక్షణకు ఉపయోగపడతాయన్నారు. ఉషూ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ పోటీలకు 60 మంది చిన్నారులు పాల్గొన్నారన్నారు. 8 ఈవెంట్లలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

జూడాల దీక్షకు ఎంపీ, ఎమ్మెల్యే మద్దతు



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(హాస్పిటల్): వైద్యులకు రక్షణ కల్పించాలని జూనియర్ డాక్టర్లు చేస్తున్న దీక్షకు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మద్దతు తెలిపారు. వారు బుధవారం వేర్వేరుగా ధర్నా కేంద్రం వద్దకు వెళ్లి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ.. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన ఘటన అత్యంత బాధాకరమన్నారు. జూడాలు కోరుతున్న సీపీఏ చట్టాన్ని అమలు చేసేలా కేంద్ర మంత్రులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వైద్య విద్యార్థుల వసతి గృహాలను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ.. వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్లు పలు డిమాండ్లను ఆమె ముందు ఉంచారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పోలీస్ ప్రొటెక్షన్ ఫోర్స్‌ను నియమించాలని, వైద్యులకు విశ్రాంతి గదులు నిర్మించాలని, సీసీ కెమెరాలు, వీధిలైట్లు తక్షణం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఏఐడీఎస్‌ఓ, ఏఐఎంఎస్‌ఎస్, ఏఐడీవైఓ మద్దతు

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారంతో పాటు ఘటనకు సంబంధించిన సాక్ష్యాలను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఏఐడీఎస్‌ఓ, ఏఐఎంఎస్‌ఎస్, ఏఐడీవైఓ సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్స్ కాలనీ నుంచి జూడాల ధర్నా శిబిరం వరకు ర్యాలీ చేపట్టారు. జూడాల సమ్మెకు మద్దతు తెలిపారు. ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు వి.హరీష్‌కుమార్‌రెడ్డి, ఏఐఎంఎస్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.తేజోవతి తదితరులు మాట్లాడారు.

స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని సర్వే నంబర్ 154లోని బుడాన్‌ఖాన్ మసీదు స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆవాజ్ కమి టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అబ్దుల్ సుభాన్, మసీదు కమిటీ కార్యదర్శి మునీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వక్ఫ్ బోర్డు జిల్లా కార్యాలయం ఎదుట ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఆధార్ – పాన్ అనుసంధానం చేసుకోవాలి



మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): ప్రతి ఉద్యోగి ఆధార్ కార్డును పాన్‌కార్డు నంబర్‌తో అనుసంధానం చేసుకోవాలని నగర పాలక కమిషనర్ రామలింగేశ్వర్ స్పష్టం చేశారు. ఆయన బుధవారం స్థానిక నగర పాలక నూతన కౌన్సిల్ హాలులో పాన్‌కార్డుతో లింకు చేసుకోని ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పాన్ కార్డుతో లింక్ చేయించుకోని ఉద్యోగుల వేతనాలపై ఆదాయపు పన్ను శాఖ జరిమానా విధిస్తుందన్నారు. ఇప్పటివరకు నగరపాలక సంస్థలో 186 మంది ఉద్యోగులకు జరిమానా విధించారని చెప్పారు. జరిమానాలను త్వరగా చెల్లిస్తే 20 శాతం మినహాయింపు ఉంటుందన్నారు. అలాగే త్వరితగతిన జరిమానా చెల్లిస్తే వచ్చే డిసెంబర్ 24వ తేదీ తరువాత ఆదాయపు పన్ను శాఖ రిఫండ్ చేస్తుందని వివరించారు. ఇప్పటికైనా అలసత్వం వహించకుండా జరిమానా చెల్లించి, ఆధార్ కార్డును పాన్ నంబర్‌తో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఎస్‌ఈ వేణుగోపాల్, మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు(లీగల్): మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులను అరికట్టడంపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి బుధవారం జొహరాపురంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వేధింపులపై బాధితులు 100, 181, 1098 హెల్ప్ లైన్ నంబర్లను సంప్రదించవచ్చన్నారు. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం- 2012, బాల్య వివాహాల నివారణ చట్టం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, వన్‌టౌన్ సీఐ రామయ్య నాయుడు, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి నిరసనలు

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 27, 28, 29 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేపట్టనున్నట్లు ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు తెలిపారు.

నిరుద్యోగులను మోసం చేసిన ముగ్గురి అరెస్ట్



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

కర్నూలు: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిన ముగ్గురు వ్యక్తులను కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు అరెస్టు చేసి కటకటాల్లోకి పంపారు. కర్నూలు మండలం బాలాజీ నగర్‌లో నివాసముంటున్న షేక్ జహీర్‌బాషా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ గ్రేడ్-3 ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అదే కాలనీలో నివాసముంటున్న తన చెల్లెలు షేక్ అయేషాబాను, ఆమె భర్త షేక్ మహమ్మద్ జాకీర్ కలిసి సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో నిరుద్యోగులకు వల వేసి డబ్బులు వసూలు చేశారు. స్థానిక రామచంద్రానగర్‌కు చెందిన నిరుద్యోగి షేక్ అబ్దుల్లా నుంచి రూ.2.08 లక్షలు, అలాగే నగరంలోని మరికొంతమంది నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారు. ఫుడ్‌కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థకు చెందిన నకిలీ సీల్స్, లెటర్ ప్యాడ్‌లు, రాజముద్రలు తయారు చేసి డబ్బులు ఇచ్చిన వారికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ కూడా ఇచ్చారు. వారికి అనుమానం రాకుండా కొంత కాలం వర్క్ ఫ్రం హోం పేరుతో వారికి టాస్క్ ఇచ్చి పనిచేయించారు. ఇందుకోసం కొన్ని నెలలు జీతాలు ఇచ్చి వారికి నమ్మకం కలిగించి తర్వాత మరింత మంది నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేశారు. బాధితులకు అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి బుధవారం మధ్యాహ్నం ముగ్గురిని బాలాజీ నగర్‌లో అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు.

ఏఎస్ఐ బదిలీ

కర్నూలు: కర్నూలు మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఏఎస్ఐ కృష్ణమోహన్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఎస్పీ బిందుమాధవ్ ఉత్తర్వులు జారీ చేశారు. పాలనాపరమైన సౌలభ్యంలో భాగంగా కృష్ణమోహన్ రెడ్డిని చిప్పగిరి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులిచ్చారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు సిటీ: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలకు 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కాగిత శామ్యూల్ బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష రాసేందుకు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఏపీ మోడల్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. కుటుంబ ఆదాయం రూ.3.5 లక్షల్లోపు ఉండాలని సూచించారు. వచ్చే నెల 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు డీఈఈ. ఖుఖు ఐఇజౌ ర.జీన వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. ఎంపికైన వారికి కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందిస్తుందని వెల్లడించారు.

మానవ మృగాలను ఉరి తీయాలి



ఐటీసీ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, నాయకులు

కల్లూరు: కోల్‌కతాలో పీజీ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని నగర డిప్యూటీ మేయర్ రేణుక డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు నగరం కృష్ణానగర్ ఐటీసీ సర్కిల్‌లో మానవహారం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. మహిళలు, చిన్నారులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన శిక్షలు విధిస్తే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయన్నారు. కార్పొరేటర్లు లక్ష్మీకాంత రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నారాయణరెడ్డి, శారదమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, రవి, సాయి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(సెంట్రల్): కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ వైద్యశాలలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన దోషులను ఉరి తీయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.నిర్మల డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నాయకులు ఎంకే గోపాల్, కె.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.